ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం: 33.0 కనిష్ఠం: 23.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 3 నవంబరు 2025



ఇండోర్ స్టేడియంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై మ్యాచ్ చూస్తున్న క్రీడాభిమానులు



స్వర్ణాంధ్ర మిషన్ డైరెక్టర్ భవాని రవికుమార్ తదితరుల సంబరాలు



కేరింతలు కొడుతున్న యువకులు





క్లాక్‌టవర్ వద్ద బాణసంచా పేలుస్తూ, త్రివర్ణంతో మురిసిన మహిళా ఆనందం

ఆకాశమే హద్దుగా..!

జగజ్జేత.. భారత మహిళా క్రికెట్ జట్టు

- అనంతలో రెండో దీపావళి..!
- బాణసంచా పేలుస్తూ అభిమానుల సంబరాలు



క్లాక్‌టవర్ వద్ద సంబరాలు

ఆకాశంలో సగం.. ఆటలోనూ సగం.. ఇన్నాళ్లూ క్రికెట్ అంటే టీం ఇండియా..! ఇకపై టీం ఉమన్ ఇండియా కూడా..! 120 కోట్ల భారతీయుల కలలను పండిస్తూ.. క్రికెట్‌లో అమ్మాయిలు అదరగొట్టేశారు. క్రికెట్ ప్రపంచం అబ్బురపోయే ఆటతీరుతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ప్రపంచ విజేతలుగా నిలిచి భారత క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఇన్నాళ్లూ పురుషుల క్రికెట్ కోసం మాత్రమే టీవీలకు అతుక్కుపోయిన ఉమ్మడి జిల్లా క్రీడాభిమానులు ఈసారి మహిళల క్రికెట్ చూడటానికి కూడా అత్యంత ఆసక్తి చూపించారు. అనంతపురం నగరంలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి మరీ వీధుల్లో నిలబడి ఆటను ఆస్వాదించే ఏర్పాటు చేశారు. టీం ఉమన్ ఇండియా ఫైనల్స్‌లో విజయం సాధించగానే అభిమానులు సంబరాలు చేసుకున్నారు. అక్కడక్కడా తడబాట్లు.. కొన్ని పొరపాట్లు.. నరాలు తెగే ఉత్కంఠ రేపాయి. ఆఖరి వికెట్.. ఆకాశంలో ఎగురుతున్న బంతిని అందుకున్నట్లు కాకుండా.. ప్రపంచకప్‌ను అందుకున్నట్లు కనిపించింది..!



సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళా వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు నగరంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్‌లోని ఏఎంసీ జాతీయ జెండా వద్ద, రామ్‌నగర్ 80అడుగుల రోడ్డులోని మైత్రీవనం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్ల వద్దకు అభిమానులు పెద్దఎత్తున చేరుకుని, మ్యాచ్‌ను ఉత్సాహంగా తిలకించారు. టవర్‌క్లాక్ వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించారు. డీఎస్‌డీఓ మంజుల ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

వైభవంగా తెప్పోత్సవం





శింగనమల చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

శింగనమల శ్రీరంగరాయని చెరువులో ఆదివారం రాత్రి గ్రామదేవతల తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా కార్తీక శుద్ధ ద్వాదశి రోజున గ్రామ దేవతలు శ్రీసీతారాములు, వెంకటరమణ స్వామి, కాలువగట్టు పార్వతీపరమేశ్వరులు, వాసవి, నగరేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. చెరువు వద్ద ఏర్పాటు చేసిన సిరి దుర్గా ఘాట్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించారు. అక్కడి నుంచి శింగనమల మత్స్యకారులు ఏర్పాటు చేసిన తెప్పలో గ్రామ దేవతలను కొలువుదీర్చి ఉత్సవం నిర్వహించారు. గోవిందనామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. తెప్పోత్సవం ముగియగానే.. ఎమ్మెల్యే గంగపూజ చేశారు. అనంతరం చెరువులో 260 దీపాలను మహిళలు వెలిగించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

-శింగనమల(ఆంధ్రజ్యోతి)

- రక్త నమూనాల సేకరణపై నీలినీడలు
- ల్యాబ్ టెక్నీషియన్లు వర్సెస్ వైద్యవిద్యార్థులు
- పెద్దాసుపత్రిలో గందరగోళం
- రోజుల తరబడి రోగులకు తిప్పలు

పరీక్షల కోసం నిరీక్షణ..!



వార్డులో రోగులు

అనంతపురం వైద్యం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగ నిర్ధారణ పరీక్షలు రోగుల సహనానికి పరీక్షగా మారాయి. ఓపీకి వచ్చిన రోగులను పరీక్షించి అవసరమైనవారిని మాత్రమే వార్డులకు అడ్మిట్ చేస్తారు. రోగం తీవ్రమైనా, ఆపరేషన్ చేయాలన్నా అడ్మిషన్ అవసరం. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి.. రిపోర్టుల ఆధారంగా రోగులకు డాక్టర్లు వైద్యం చేస్తారు. రోగం నిర్ధారణ కావాలంటే పరీక్షలు నిర్వహించాలి. అందుకు రక్తనమూనాలను సేకరించాలి. మరి బ్లడ్ శాంపిల్స్‌ను ఎవరు తీయాలి..? ఇక్కడే సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్స్‌దా..? వైద్య విద్యనభ్యసిస్తున్న హౌస్ సర్జన్స్‌దా.. పీజీ విద్యార్థులదా..? అన్న అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

8 బ్లాక్‌లు.. 12 వార్డులు...

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎనిమిది బ్లాక్‌లలో వార్డులను ఏర్పాటు చేశారు. సర్జికల్ బ్లాక్‌లో జనరల్ సర్జరీ, ఓబీజీ వార్డులతో పాటు ఎస్ఎన్‌సీయూ, ఎన్ఐసీయూ ఉన్నాయి. మెడికల్ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్థోపెడిక్, ఒకటో అంతస్తులో మెడిసన్, రెండో అంతస్తులో పీడియాట్రిక్స్, మోడర్న్ బ్లాక్స్‌లో పల్మనాలజీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, సైకియాట్రి, ఎమర్జెన్సీ మెడిసన్, ఏఎంసీ, బర్న్ వార్డులు ఉన్నాయి. మొత్తం 560 మంచాలు ఉండగా.. నిత్యం 1500 మంది రోగులు అడ్మిషన్‌లో ఉంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. రోజుకు దాదాపు 300 మంది రోగులను అడ్మిట్ చేస్తున్నారు. వీరిని ఓపీ నుంచి వార్డులకు పంపేటప్పుడే శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపాల్సి ఉంటుంది.

శాంపిళ్లు తీసి.. చేతుల్లో పెడుతున్నారు..

వార్డులోని రోగులకు రోగనిర్ధారణ పరీక్షలు చేయాలంటే శాంపిల్స్‌ను తీసి ల్యాబ్‌కు పంపాలి. పరీక్షలు నిర్వహించిన అనంతరం రిపోర్టులను తీసుకువచ్చి సంబంధిత రోగుల అడ్మిషన్ బుక్‌లోని ల్యాబ్‌రిపోర్టు పేజీల్లో నమోదు చేయాలి. 24 గంటల సేవలందించే పెద్దాసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే శాంపిల్స్‌ను సేకరిస్తున్నారు. అదే సమయంలోనే అడ్మిషన్‌లో ఉన్నవారికి, కొత్తగా వచ్చిన వారికి శాంపిల్స్ తీసి ల్యాబ్‌లకు తీసుకెళ్తున్నారు. మిగిలిన సమయంలో అడ్మిషన్ అయ్యేవారు మరుసటి రోజువరకు ఆగాల్సిందే. తప్పని పరిస్థితులయితే శాంపిల్స్‌ను తీసి రోగుల బంధువుల చేతుల్లో పెడుతున్నారు. సంబంధిత ల్యాబ్‌కెళ్లి రోగుల బంధువులే ట్యూబ్‌లను తెచ్చుకోవాలి. మళ్లీవాటిని ఇచ్చిరావాలి. పరీక్షలు అనంతరం రిపోర్టులను తెచ్చుకోవాలి. ఇలా ల్యాబ్, వార్డు అంటూ తిరగాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనల మేరకు టీచింగ్ హాస్పిటల్ వార్డుల్లోని రోగులకు ఎంబీబీఎస్ పూర్తిచేసిన హౌస్‌సర్జన్స్, పీజీ విద్యార్థులే శాంపిల్స్ తీయాలి. ఇక్కడ తగినంత సిబ్బంది లేకపోవడంతో ల్యాబ్ టెక్నీషియన్స్‌తోనే శాంపిల్స్‌ను తీయిస్తున్నట్లు తెలుస్తోంది.



శాంపిళ్లను సేకరిస్తున్న ల్యాబ్ సిబ్బంది

శాంపిళ్లు తీయడం తెలియదా..?

ఎన్ఎంసీ నిబంధనల మేరకు హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులే రోగుల నుంచి శాంపిల్స్‌ను తీయాల్సి ఉంటుంది. రోగనిర్ధారణకు ఎంత మోతాదులో రక్తనమూనాలు అవసరమో సంబంధిత హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు తెలియకపోవడం వారి పనితీరుకు అద్దపడుతోంది. రక్తనమూనాల సేకరణపై హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు, ల్యాబ్ టెక్నీషియన్లు ఒకరిపై ఒకరు దాటవేత ధోరణిని అవలంబిస్తున్నారు. వీరి వ్యవహారంతో రోగులు సతమతమవుతున్నారు.

నిబంధనలు తెలియవు..



రక్తనమూనాల సేకరణకు సంబంధించి నిబంధనలు ఎలాఉన్నాయో నాకు తెలియదు. సమయమిస్తే పరిశీలించి తెలియజేస్తాం.

-ప్రొఫెసర్ విజయశ్రీ, ప్రిన్సిపాల్, వైద్యవిద్య కళాశాల

మరో డీఎస్సీకి సన్నద్ధం

- 17న జిల్లా విద్యాశాఖాధికారులతో కమిషనర్ సమీక్ష
- నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

(వివరాలు 7వ పేజీలో...)

కూలిన హెచ్చెల్సీ హెడ్ రెగ్యులేటర్

(వివరాలు 7వ పేజీలో...)

'అనంత' రైతుకు నిరాశ

- శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలు
- ఖరీఫ్‌లో భారీగా తగ్గిన వేరుశనగ దిగుబడి
- పరిశీలించాలని రైతుల వేడుకోలు
- కరువు మండలాల జాబితాలో దక్కని చోటు

7

కసాపురంలో తులసి ధాత్రి కల్యాణం

గుంతకల్లుటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం తులసి ధాత్రి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ తంతు సాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

తులసి ధాత్రి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు







ఇది బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ సమీపాన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)పై నిర్మించిన వంతెన. శిథిలావస్థకు చేరుకున్న ఈ వంతెన 2021లో కూలింది. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించారు. ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో చేసేదిలేక 2022లో రైతులు సొంత నిధులతో తాత్కాలిక ఇనుప వంతెనను ఏర్పాటు చేసుకున్నారు. అది కూడా 2023లో కూలిపోయింది. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకున్న నాటి వైసీపీ పాలకులు ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.. రైతుల సమస్యను గుర్తించి, చర్యలు ప్రారంభించారు. అత్యవసర నిధులు రూ.1.6 కోట్లు తెచ్చి కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఇటీవలే పనులు పూర్తయ్యాయి. దీంతో రైతుల కష్టాలు తీరాయి. అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి)



సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురష్కరించుకుని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఆదివారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

7న కళ్యాణదుర్గానికి లోకేశ్ రాక



కళ్యాణదుర్గం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న కళ్యాణదుర్గానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రానున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సభా వేదిక, ఏర్పాట్లను పరిశీలించారు. లోకేశ్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రవినాయుడు కూడా కళ్యాణదుర్గానికి వచ్చి ఏర్పాట్లు, సభా వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 7న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, కష్టపడ్డ కార్యకర్తలను లోకేశ్ చేతుల మీదుగా సన్మానిస్తామని తెలిపారు. 8న పట్టణంలో నూతనంగా నిర్మించిన కనకదాసు విగ్రహాన్ని లోకేశ్ ఆవిష్కరిస్తారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో లోకేశ్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు.

ఐకమత్యంతో ముందుకెళదాం

కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

అనంతపురంరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బలిజ కులస్థుల ఆశయాలను నెరవేర్చుకునేందుకు ఐకమత్యంతో ముందుకు సాగుదామని కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం గుత్తి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో బలిజ, కాపునాడు సంఘం స్వర్ణోత్సవ రాయలసీమ ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. అంతకుముందు బళ్లారిరోడ్డులోని పవర్ ఆఫీసు నుంచి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నాగభూషణం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో బలిజ కులస్థులు రాజ్యాధికారంలో వెనుకబడ్డారన్నారు. ఐక్యత కొరవడటమే ఇందుకు కారణమన్నారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్టి రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాపు, బలిజలకు సరైన రాజకీయ ప్రాధాన్యం లేదన్నారు. ఈనెల 30న విజయవాడలో జరిగే కాపు నాడు స్వర్ణోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాయలసీమ కో-ఆర్డినేటర్ భాస్కర్ నాయుడు, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్, టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, న్యాయవాది గాజుల ఆదెన్న, రవికాంత్ రమణ, పగడాల మల్లికార్జున, జనసేన రాష్ట్ర నేత కాయగూరల లక్ష్మీపతి, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రాచానపల్లి పల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పాముదాయి రఘు, నాయకులు పాముదాయి వెంకటేష్, రాయల్ మురళి పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ఆలిండియా సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

ఉరవకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆలిండియా సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 69వ ఏపీ స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 220 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ జల్లాల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అంతకుముందు క్రీడా పతాకాన్ని ఎగురవేసి, జ్యోతిని వెలిగించారు. అనంతరం ఏపీ స్కూల్ గేమ్స్ పరిశీలకుడు రమేష్ పోటీలను ప్రారంభించారు. జిల్లా జట్టుల మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మారుతి ప్రసాద్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కూలిన హెచ్చెల్సీ హెడ్ రెగ్యులేటర్



కూలిన హెడ్ రెగ్యులేటర్

బొమ్మనహాళ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని 116/399 కి.మీ వద్ద ఉన్న అత్యవసర ద్వారం హెడ్ రెగ్యులేటర్ గేటు ఆదివారం రాత్రి కూలిపోయింది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో గేట్లకు తుప్పు పట్టి, చివరికి ఇనుప పలకలు విరిగిపోయి కూలిపోయాయని స్థానికులు చెబుతున్నారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. నాలుగు గేట్లు ఉండగా మూడు గేట్లు విరిపోయాయి. సరిహద్దులో 1500 క్యూసెక్కులు నీరు వస్తున్నాయని జేఈఈ అల్తాఫ్ తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ తెగిపోవడం వల్ల ప్రస్తుతం నీరు ఎలాంటి వృథా కావని, సరఫరాకు ఎలాంటి ఆటంకం లేదు అని తెలిపారు. సోమవారం ఉదయం ఉన్నతాధికారులు పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు జేఈఈ తెలిపారు.

పింఛన్ కోసం వెళ్లిన వృద్ధురాలి మృతి

రొద్దం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రొద్దం గ్రామానికి చెందిన హనుమక్క(65) అనే వృద్ధురాలు పింఛన్ కోసం వెళ్లి మృత్యువాత పడింది. ఈనెల 1న రొద్దంలో ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. సుదూరంగా ఉన్న పశువుల ఆసుపత్రికి పింఛన్‌దారులను పిలిపించారు. అక్కడికి వెళ్లిన హనుమక్క తీవ్ర అస్వస్థతకు గురవడంతో 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. అధికారులు ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయడం లేదు. దీంతో వృద్ధురాలు పాత హరిజనవాడ నుంచి పింఛన్ కోసం ఊరిబయట ఉన్న పశువుల ఆసుపత్రి వద్ద నడుచుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకేచోటికి పింఛన్‌దారులందరినీ పిలిపించి పంపిణీ చేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధురాలికి భర్త చనిపోగా పిల్లలు ఎవరూ లేకపోవడంతో బంధువులు దహన సంస్కారాలు చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ఆదివారం గన్నెవారిపల్లి కాలనీకి చెందిన అబ్దుల్ గఫూర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 64 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. గఫూర్ గంజాయిని తెప్పించుకొని 4 గ్రాముల చొప్పున చిన్నచిన్న ప్యాకెట్లను తయారు చేసుకొని విక్రయించేవాడని అన్నారు. సమాచారం మేరకు అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

30 మందిపై రౌడీషీట్

కదిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హత్య, హత్యాయత్నం, గంజాయి విక్రయాలు, తరచూ నేరాలకు పాల్పడుతున్న 30 మందిపై రౌడీ షీట్ నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 30 మందిపై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు వివరించారు. వీరు ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే పట్టణంలో తీవ్ర నేరాలకు పాల్పడిన ముగ్గురిపై పీడీ యాక్టు పెట్టి జైలుకు తరలించడానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. గతంలో రౌడీషీటర్‌గా ఉండి సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌటీషీట్ తొలగించడానికి నిర్ణయించినట్లు వివరించారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

అనంతపురంరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్పీడీసీఎల్‌లో మొదటిసారిగా డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని సీఎండీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతపురం జిల్లా వినియోగదారులు 9133331912 నెంబరును, సత్యసాయి జిల్లా వినియోగదారులు 8977716661 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు టేబుల్ టెన్నిస్ జిల్లాస్థాయి పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకాల ఎంపిక పోటీలు ఈనెల 4వతేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీ పాండురంగయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక సప్తగిరిసర్కిల్‌లో ఉన్న అనంతపూర్ క్లబ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-15 బాల, బాలికలు, సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17వతేదీ నుంచి విశాఖపట్నంలో నిర్వహించే ఏపీ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9848463245 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'అనంత' రైతుకు నిరాశ

- కరువు మండలాల జాబితాలో దక్కని చోటు
- శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలు
- ఖరీఫ్‌లో భారీగా తగ్గిన వేరుశనగ దిగుబడి
- ఇతర పంటలదీ అదే తీరు
- పరిశీలించాలని రైతుల వేడుకోలు



గుత్తి మండలం గొందిపల్లిలో తొలగించిన వేరుశనగ (ఫైల్)

అనంతపురం అర్బన్ నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో కరువు మండలాల జాబితా ప్రకటనలో అనంతకు తీరని నిరాశ మిగిలింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు జిల్లాల్లో 37 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించారు. ఇందులో శ్రీసత్యసాయిలో 25 మండలాలు, అన్నమయ్య 9, ప్రకాశంలో 3 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాల జాబితాలో చేర్చారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా కరువు మండలాల జాబితాను విడుదల చేసింది. ఇందులో అనంత జిల్లాకు స్థానం లేకపోవడంపై బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. కరువు మండలాల జాబితాలో ఉంటేనే ఆయా మండలాల్లోని రైతులకు పంటనష్టపరిహారం ఇస్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలకు కావాల్సిన కీలక సమయాల్లో వర్షం పడలేదు. దీంతో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గిపోయింది. కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న ఇతర రకాల పంటల పరిస్థితి దయనీయంగా మారింది. అనంత జిల్లాలోని ఒక్క మండలాన్ని కూడా కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కీలక సమయాల్లో కురవని వర్షం

ఈ ఏడాది ఖరీఫ్‌లో అరకొర వర్షాలకే వేరుశనగ పంటను సాగు చేశారు. పంట కీలక సమయం పూత దశ, ఊడలు దిగే దశ, పిందెలు ఊరే సమయాల్లో వర్షం రాకపోవడంతో వేరుశనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. పలు ప్రాంతాల్లో వేరుశనగ పంట పైకి పచ్చగా ఉన్నా.. దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. జూలై, సెప్టెంబరు మాసాల్లో పంటల కీలక సమయాల్లో వర్షం పడలేదు. ఈ పరిస్థితుల్లో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం తదితర ప్రాంతాల్లో వర్షాభావంతో వేరుశనగ పంట ఎండిపోయింది. దీంతో కోతకు ముందే పంటను దున్నేశారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 47.9 మి.మీ నమోదయింది. ఇందులో జూన్ మొదటి వారంలో ఎక్కువ శాతం వర్షం కురిసింది. జూలై సాధారణ వర్షపాతం 64.3 మి.మీలు కాగా 34.7 మి.మీ నమోదయింది. జూన్ 11 నుంచి ఆగస్టు 5వతేదీ దాకా పంటలకు సరిపడా వర్షం కురవలేదు. ఆ సమయంలో ఎక్కువ మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. ఆగస్టు 5వతేదీ తర్వాత వర్షాలు కురిశాయి. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 84.4 మి.మీలు కాగా.. 165.9 మి.మీ కురిసింది. సెప్టెంబరు సాధారణ వర్షపాతం 111.6 మి.మీలు కాగా.. 87.0 మి.మీ మాత్రమే నమోదయింది. జూన్, జూలై మాసాలతో పాటు సెప్టెంబరులో తక్కువ వర్షాలు పడ్డాయి. ఆగస్టు నెలలో పడిన వర్షాలతో నాలుగు నెలల ఖరీఫ్ సీజన్ సాధారణ వర్షపాతం 321.5 మి.మీలుకాగా.. 335.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 4.3 మి.మీ వర్షపాతం అదనంగా పడినట్లు నమోదయింది. సీజన్ మొత్తం వర్షపాతం వివరాలు ఆధారంగా తీసుకోవడంతోనే.. అనంత జిల్లాలోని మండలాలకు కరువు జాబితాలో చోటు కల్పించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

తగ్గిన వేరుశనగ దిగుబడి

గత ఏడాది తరహాలోనే ఈసారి పంట కీలక దశల్లో వానలు పడకపోవడంతో వేరుశనగ పంట దిగుబడి భారీగా తగ్గింది. పంట పలు కీలక దశల్లో వర్షం పడి ఉంటే పంట బాగా పండితే ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ఈసారి జిల్లాలోని సగానికిపైగా మండలాల్లో ఎకరాకు క్వింటా నుంచి రెండు క్వింటాళ్లలోపు దిగుబడి మాత్రమే వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో మూడు క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో చెట్టుకు నాలుగు లేదా ఐదు కాయలే ఉన్నాయి. కాయలున్న చోట కూడా అవుటన్ లేకపోవడంతో దిగుబడి భారీగా తగ్గింది. వ్యవసాయ, ప్రణాళిక శాఖలు చేపట్టిన పంటకోత ప్రయోగాల్లోనూ దిగుబడి తగ్గినట్లు తేటతెల్లమైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 2.21 లక్షల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో వేరుశనగ 72 వేల హెక్టార్లల్లో సాగైంది. వేరుశనగ పంట సాగు కోసం ఎకరాకు రూ.30వేల నుంచి రూ.45వేలకు పైగాపెట్టుబడి పెట్టారు. వర్షాధారం కింద సాగు చేసిన కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర ప్రధాన పంటల పరిస్థితి అదే తీరులో ఉంది. ఖరీఫ్‌లో పంటల దిగుబడి తగ్గడంతో రైతులు నష్టపోయారు.

పునరాలోచించాలని రైతుల వేడుకోలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల కీలక సమయాల్లో సరైన వర్షం పడకపోవడంతో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. మిగతా పంటల పరిస్థితి అంతే. క్షేత్ర స్థాయిలో నెలకొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని.. అనంత జిల్లాలో పంట దిగుబడులు తగ్గిన మండలాలను కరువు మండలాల జాబితాలోకి చేర్చాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. జిల్లాలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, కరువు మండలాల జాబితాలో చేర్చేలా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

సరైన సమయంలో వర్షం పడలేదు



ఈ సారి ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. వేరుశనగ విత్తే సమయంలో వర్షం పడింది. తర్వాత కీలకమైన ఊడలు దిగే సమయంలో, పిందెలు ఊరే సమయంలోనూ వర్షం పడలేదు. దీంతో ఈసారి ఎకరాకు మూడు బస్తాలు కూడా దిగుబడి రాలేదు. పంట సాగు కోసం రూ.2 లక్షలు దాకా ఖర్చు చేశా. వేరుశనగ అమ్ముదామనుకుంటే బయట ధరలు తక్కువగా ఉన్నాయి. పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. ఈ ఏడాది కరువు మండలాల జాబితాలో ఒక్క మండలం కూడా లేదంటున్నారు. ఇలాగైతే మరింతగా నష్టపోతాం. పంటనష్టపరిహారం అందించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

-చంద్రశేఖర్, రైతు, పెద్దమట్లగొంది, శింగనమల మండలం

దిగుబడి తగ్గడంతో నష్టపోయా



ఈసారి ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి పెట్టా. ఈసారైన పంట బాగా పండుతుందని ఎంతో ఆశతో విత్తనం వేశాం. పంట సాగు చేసిన తర్వాత కీలక దశల్లో వర్షాలు పడలేదు. దీంతో ఎకరాకు నాలుగు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. వర్షాన్ని నమ్ముకొని పంటలు సాగు చేసి నష్టపోతున్నాం. పంట దిగుబడి సరిగా రాకపోయినా కరువు మండలాల జాబితాలో మండలాన్ని చేర్చకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు న్యాయం చేయాలి.

-సుంకన్న, రైతు, గోవిందవాడ, బొమ్మనహాల్ మండలం

అన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఇతర పంటలు సకాలంలో వర్షాలు రాకపోవడం వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం వల్ల రైతులు, కూలీలకు నష్టం జరుగుతుందన్నారు. సకాలంలో వర్షాలు రాక విత్తనం వేయాలా వద్దా అని దిక్కుతోచని పరిస్థితిల్లో రైతులు అరకొర పంటలు సాగు చేశారని తెలిపారు. జూలై ఆఖరు, ఆగస్టులో కురిసిన వర్షాలకు సాగుచేసిన పంటల దిగుబడులు పూర్తిగా తగ్గాయని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తొలగించిన వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు తడిసిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్పించి, రైతులకు నష్టపరిహారం, బీమా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మరో డీఎస్సీకి సన్నద్ధం

- 17న జిల్లా విద్యాశాఖాధికారులతో కమిషనర్ సమీక్ష
- నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

అనంతపురం విద్య, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మరో డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియ ఇటీవలే ముగిసింది. చాలా మంది అభ్యర్థులు పోటీ పడినా అవకాశాలు రాక నిరుత్సాహపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఇచ్చిన మాట ప్రకారం ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో విద్యాశాఖ రాష్ట్ర యంత్రాంగం మంత్రి లోకేశ్ హామీ అమలుకు అడుగులు వేస్తోంది. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఇదే విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులకు స్పష్టతనిచ్చారు. రెండు రోజుల క్రితం జరిగిన వెబెక్స్ మీటింగ్‌లో డీఎస్సీకి సర్వం సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని.. మే లేదా జూన్‌లో టీచర్ల నియామకాల ప్రక్రియ ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో 758 ఖాళీలు

కొత్త టీచర్ల నియామకాలు జరిగినా ఇంకా వందల సంఖ్యలోనే జిల్లాలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏపీ పాఠశాలలో ఏపీ కేడర్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో జిల్లా యంత్రాంగం లెక్కలు తీసింది. మొత్తం అన్ని కేడర్లు కలిపి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, నగర పాలక యాజమాన్యాల పరిధిలో 758 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఇందులో వచ్చే డీఎస్సీకి ఎన్ని టీచర్ పోస్టులు చూపిస్తారోనని అభ్యర్థులు ఆందోళనగా చూస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉన్న ఖాళీ పోస్టులలో 70 శాతం సర్వీస్ టీచర్లకు పదోన్నతులు కోసం కేటాయించాల్సి ఉంటుంది. మిగిలిన 30 శాతం ఖాళీలను డీఎస్సీ ద్వారా కొత్త టీచర్లకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది.

17న కమిషనర్‌తో సమావేశం

విద్యాశాఖ కార్యక్రమాలతో కొత్త డీఎస్సీ పోస్టులు గురించి జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్షించడానికి కమిషనర్ ప్రత్యేకంగా జిల్లాల వారీగా సమీక్షలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే జిల్లా విద్యాశాఖకు ఈనెల 17న రాజధానిలో సమావేశం నిర్వహిస్తున్నారు. డీఎస్సీ ఖాళీలపై పూర్తిస్థాయిలో స్పష్టత రావాలంటే కేడర్ వారీగా లెక్కలు తేలాల్సి ఉంటుంది. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు ఎంఈఓలు, హెచ్‌ఎంలతో డివిజన్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే వారికి పట్టిక పంపించి సమాచారం తీసుకు రావాలని ఆదేశించారు. ఆ వివరాలను రాష్ట్ర అధికారులకు ఇవ్వనున్నారు. అనంతరం జిల్లాకు ఎన్ని టీచర్ పోస్టులు కేటాయిస్తారో అంచనాకు వచ్చే అవకాశం ఉంటుందని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి.

నిరుద్యోగుల్లో ఆశలు

మళ్లీ కొత్త డీఎస్సీ నోటిఫికేషన్‌కు అడుగులు పడుతుండడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మొన్న చేజారిన ఉద్యోగాన్ని ఈసారైనా సాధించాలనే తపన అభ్యర్థుల్లో మొదలయింది. అప్పుడే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొందరు ఇతర జిల్లాల్లోని కోచింగ్ సెంటర్లకు వెళ్లగా.. మరికొందరు అనంత జిల్లాలో ఉన్న కోచింగ్ సెంటర్లలో చేరి చదువులు మొదలు పెట్టారు. దీంతో కోచింగ్ సెంటర్లలో సందడి నెలకొంది.

13న జాబ్‌మేళా

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని షిర్డీసాయిబాబా సేవాసమితి అధ్యక్షుడు వీరనారాయణ, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళా స్థానిక పుట్టపర్తి రహదారిలోగల షిర్డీసాయిబాబా ఆలయంలో ఈనెల 13న ఉంటుదని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు మహిళలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత ఉంటుందని, హస్టల్, భోజన, రవాణా ఖర్చులు కూడా కంపెనీ భరిస్తుందని తెలిపారు. వివరాలకు 897702409, 7075699199 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీకే నాయుడు క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

సెంచరీతో కదంతొక్కిన నియాన్ శ్యామ్



సెంచరీ కొట్టిన నియాన్ శ్యామ్ కంగయాన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ సీకే నాయుడు నేషనల్ క్రికెట్ టోర్నీ ఆదివారం అనంతపురం క్రీడా మైదానంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఆంధ్రా అండర్-23, పుదుచ్చేరి అండర్-23 జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను రెఫరీ నియతి లోకూర్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పుదుచ్చేరి జట్టు ఓవర్లలో 4వికెట్లకు 268 పరుగులు చేసింది. కెప్టెన్ నియాన్ శ్యామ్ కంగయాన్ సెంచరీ(256 బంతుల్లో 21 బౌండరీలతో 131 పరుగుల)తో నాటౌట్‌గా నిలిచాడు. నితిన్‌ప్రణవ్ 26, ప్రథ్వీరాజన్ ఖన్నా 29 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు కమిల్, ఆదిత్యరెడ్డి, హేమంత్‌రెడ్డి, సుమిత్ చెరో వికెట్ తీశారు.

ఆల్మట్టిపై ఇక చావో.. రేవో..

- ఆనకట్టు ఎత్తు పెంపును ఉపసంహరించుకోవాల్సిందే
- రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కుంచం



మాట్లాడుతున్న కుంచం

అనంతపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి ఆనకట్ట వ్యవహారంలో ఇక చావో.. రేవో తేల్చుకుంటామని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సమితి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఆల్మట్టి ఆనకట్టు ఎత్తు పెంపు ప్రతిపాదనలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక సీఎం సిద్దరామయ్య, కేంద్ర జలవనరులశాఖ మంత్రి, కర్ణాటక గవర్నర్, నీటిపారుదల శాఖ మంత్రులకు రాసిన బహిరంగలేఖలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రైతులు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా ఆశీంకట్టుదారులు తమ పంటలకు నీరు అందించలేక తీవ్ర కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే ప్రతిపాదనలను విరమించుకోవాలని ఆయన కోరారు. అలా చేయనిపక్షంలో ప్రజలకోసం తాను ప్రాణత్యాగానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు.

యాదవ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా రామకృష్ణ యాదవ్



నూతన కార్యవర్గంతో యాదవ సంఘం నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నక్కా రామారావు యాదవ భవన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్ యాదవ్‌ను యాదవ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సమక్షంలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ్ యాదవ్, కార్యదర్శిగా పరంధామ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు నరసింహులు యాదవ్, నారాయణస్వామి, జైపాల్ యాదవ్, సుధాకర్ యాదవ్, ఆనంద్ యాదవ్, శ్రీనివాసులు, రవి యాదవ్, రామచంద్ర యాదవ్, కృష్ణమూర్తి యాదవ్, గుత్తి పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాపంపేట భూవివాదంలో కొత్త మలుపు

- రాచూరి వెంకట కిరణ్‌పై ఆర్డీఓ ఫిర్యాదు
- వీఆర్వో సంతకాలు ఫోర్జరీ చేశాంటూ కంప్లైంట్
- రూరల్‌లో కేసు నమోదు

అనంతపురం క్రైం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ పరిధి పాపంపేట భూవివాదం కొత్త మలుపు తిరిగింది. ఇన్నాళ్లూ పాపంపేట భూముల్లో తమ భూములున్నాయంటూ... చెబుతున్న రాచూరి వెంకటకిరణ్‌పై అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. రాచూరి వెంకట కిరణ్ పాపంపేట భూముల్లో పొజిషన్‌లో ఉన్నట్టుగా ప్రస్తుతం రుద్రంపేట రెండో సచివాయం వీఆర్వోగా పనిచేస్తున్న రఘుయాదవ్ సంతకం ఫోర్జరీ చేశాడంటూ పోలీసులకు ఆర్డీఓ కేశవనాయుడు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు కట్టారు. వెంకట కిరణ్ పాపంపేటలో పొజిషన్‌లో ఉన్నట్లు 2024 ఆగస్టు 13వ తేదీన ఆరు సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. ప్రస్తుతం రుద్రంపేటలో పనిచేస్తున్న వీఆర్వో గోళ్ల రఘుయాదవ్ 2019 నుంచీ 2024 వరకూ ఏ నారాయణపురం వీఆర్వోగా పనిచేశారు. అదే సమయంలో సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. ఈ సర్టిఫికెట్లు వీఆర్వో ప్రమేయం లేకుండా జారీ అయినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీఆర్వో సంతకాలు ఫోర్జరీ చేసినట్టుగా గుర్తించిన ఆర్డీఓ కార్యాలయం నుంచీ అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో రూరల్ పోలీసులు వెంకట కిరణ్‌పై కేసు నమోదు చేశారు. అనేక రాజకీయ మలుపులు తిరిగిన ఈ భూవివాదంలో రాచూరిపై కేసు నమోదు కావడం చర్చకు దారితీసింది.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సేవలో పరిటాల సునీత



ఆలయ ఆవరణలో దీపారాధన చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదివారం సందర్శించారు. కర్తీకమాసం సందర్భంగా ఆమె ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తర్వాత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామి, పార్వతీ దేవి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆలయ ప్రదక్షిణ చేశారు. తర్వాత ఆలయంలో పరిస్థితులను పరిశీలించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత ఎమ్మెల్యేకు ప్రధాన అర్చకుడు రాముస్వామి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ టీడీపీ ఇన్‌చార్జి బాలాజీ, కన్వీనర్ శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ క్రిష్ణమోహన్ చౌదరి, నాయకులు అనిల్ చౌదరి, శశాంక చౌదరి, వేణుగోపాల్ రెడ్డి, గంగలకుంట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో వైద్యశిబిరం

అనంతపురం రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట ఇందిరమ్మ కాలనీలో ఆదివారం ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్ నారాయణ, టీడీపీ రాప్తాడు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ఆస్పత్రులకు చెందిన వైద్యులు, సిబ్బంది హాజరై కాలనీవాసులకు ఉచితగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు సుంకర రమేష్, వైద్యులు బాలాజీ, వేణుగోపాల్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, నాగేంద్ర, రెడ్ క్రాస్ సొసైటీ టెక్నీషియన్ తిప్పేస్వామి, ఎస్ఆర్ సొసైటీ సభ్యులు నాగశివ, మహేంద్ర, శిరీష, మంజులవాణి, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనం



పూజల్లో పాల్గొన్న దగ్గుపాటి ప్రసాద్, నాదెండ్ల బ్రహ్మం చౌదరి

రాప్తాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా తరలివచ్చారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరితో పాటు ఇతర ప్రముఖులు కూడా హాజరయ్యారు. తొలుత వేదపండితులు ఉసిరి చెట్టుకింద శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందరూ వనభోజనాలు చేసి ఆనందంగా గడిపారు.

ఏఈఓల జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతపురం అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓలు) సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఆదివారం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మురళీకృష్ణ ఎంపికయ్యారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా శ్వేత, సహాధ్యక్షులుగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా సుజిత, దిలీప్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా మనోజ్ కుమార్, భరత్‌రాజ్, భాగ్యశ్రీ, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామన్న, ప్రచార కార్యదర్శిగా మణికంఠకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, నరసింహ, అశోక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మైనార్టీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మైనార్టీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యమని ఆల్‌మేవా నాయకులు తెలిపారు. కర్నూలులో ఆదివారం జరిగిన ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) సమావేశానికి జిల్లాకు చెందిన ప్రతినిధులు ఫరూక్‌అహ్మద్, ఫక్రుద్దీన్, షెక్షావలి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన మైనార్టీ ఉద్యోగులందరికీ బీసీ-ఈ కేటగిరి కింద 4శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఉర్దూ అకాడమీ మైనారిటీ కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగుల సీనియార్టీని గుర్తించి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అమరావతిలో ఆల్‌మేవా సంఘం కార్యాలయానికి అర ఎకరా స్థలం కేటాయించాలన్నారు. ముస్లిం విద్యార్థులకు మైనార్టీ స్టడీసర్కిళ్లు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసి, ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలని కోరారు. అలాగే మైనార్టీ కార్పొరేషన్ ద్వారా విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. త్వరలో సీఎం చంద్రబాబును కలిసి సమస్యలను విన్నవిస్తామని వారు పేర్కొన్నారు.

రైల్లో నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

గార్లదిన్నె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి రైల్లో నుంచి పడి చిన్నవీరా అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల మేరకు.. రాయచూరు జిల్లా షాపూర్‌కు చెందిన చిన్నవీరా బెంగళూరులోని వాటర్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఇంటికి వెళ్లేందుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్నాడు. డోర్ వద్ద కూర్చున్నాడు. తోటి ప్రయాణికులు గొడవపడ్డారు. ఈ క్రమంలో డోర్ వద్ద కూర్చున్న చిన్నవీరాను గొడవపడుతున్న ప్రయాణికులు తోసేశారు. ప్రమాదంలో చిన్నవీరాకు కుడికాలు విరిగిపోగా, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రైల్వే సిబ్బంది, స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం/రాప్తాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థి శ్యామ్ శ్రీనిత్‌రెడ్డిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభినందించారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె ఆ విద్యార్థికి శాలువా కప్పి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. రాప్తాడులోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్యామ్ శ్రీనిత్‌రెడ్డి ఇటీవల భారత రాజ్యాంగంపై నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలతో పాటు క్విజ్ పోటీలో ప్రతిభ చూపి మాక్‌అసెంబ్లీకి ఎంపికయ్యారు. ఈ నెల 26వ తేదీన జరగబోయే మాక్ అసెంబ్లీలో సైతం ప్రతిభ చూపి రాప్తాడు నియోజకవర్గానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే సునీత ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి, పీఈటీ మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పిల్లకాలువ

- కనగానపల్లిలో రోడ్డు పక్కన తవ్వి వదిలేశారు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

కనగానపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల చెరువులకు హంద్రీనీవా నీరు అందించాలని గత వైసీపీ ప్రభుత్వంలో పిల్లకాలువను ఆర్భాటంగా తవ్వి అర్ధంతరంగా వదిలేశారు. అయితే ఆ కాలువను కనగానపల్లి మారెమ్మ గుడి వద్ద ప్రధాన రహదారి పక్కనే తవ్వడంతో రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. ఏమరుపాటుగా ఉంటే కాలువలోకి పడిపోవడం ఖాయమని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో బండమీదపల్లి చెరువుకు హంద్రీనీవా నీరు అందించేందుకు కోనాపురం నుంచి కాలువ తవ్వారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చాక తమ ప్రభుత్వంలో కూడా చెరువులకు నీరు అందించాం అని చెప్పుకునేందుకు ఆర్భాటంగా కనగానపల్లి వద్ద ప్రధాన రోడ్డు పక్కన కాలువ తవ్వారు. దీనిని అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు గోరంట్ల మాధవ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. కిలో మీటర్ వరకూ కాలువ తవ్వి నిధుల కోసం వేచి చూశారు. ఎన్ని రోజులైనా ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అర్ధంతరంగా వదిలేశారు. అంతే అప్పడి నుంచి ఆ కాలువ అలాగే ఉండిపోయింది. ఆ కాలువ రోడ్డు పక్కన ఉన్నట్లు దగ్గరికి వెళితే గానీ తెలీదు. రోడ్డుకు కాలువకు నడుమ ఏపుగా గడ్డి పెరిగి పోయింది. వాహన దారులు కాలువ కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు సైడు ఇచ్చేందుకు రోడ్డు దిగితే కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇటీవల రామగిరి మండలానికి చెందిన ఓ ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కాలువలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతన్ని ఆసపత్రికి తరలించి ప్రాణాలు కాపాడా రు. రోడ్డుపక్కన కాలువ ఉన్నట్లు ఎటువంటి ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల భారిన పడుతున్నారని, ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న కాలువ



కాలువలో పడిన యువకుడిని బయటకు తీస్తున్న స్థానికులు (ఫైల్)

భయంగా ఉంది..



పాలవాయి గ్రామానికి చెందిన నేను కనగానపల్లి సమీపంలో పొలాన్ని గుత్తకు తీసుకుని పంటలు సాగుచేస్తున్నాను. పంటకు నీరు అందించేందుకు రాత్రి సమయంలో బైక్‌లో పొలం వద్దకు వెళ్తుంటాను. ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే రోడ్డు దిగాల్సి వచ్చినప్పుడు కాలువలో పడతామని భయంగా ఉంటోంది.

-రామచంద్ర, పాలవాయి

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి..



ఈ మధ్యనే ఓ యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడిపోయాడు. కాలువ లోతు ఎక్కువగా ఉండటంతో ఎవరూ ప్రమాదాన్ని గమనించలేదు. పొలాలకు వెళుతున్న మేము గుర్తించి ఆ యువకున్ని కాపాడాం. స్థానికేతరులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతుంటారు. పెనుప్రమాదం జరగకనే అధికారులు చర్యలు చేపట్టాలి.

-అంకే రామచంద్ర, కనగానపల్లి

మున్సిపల్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధిస్తాం

- ఎమ్మెల్యే దగ్గుపాటి
- 41వ డివిజన్‌లో భారీగా టీడీపీలోకి చేరికలు

అనంతపురం క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక 41వ డివిజన్‌లో సుమారు 100 కుటుంబాల వారు ఆదివారం టీడీపీలోకి చేరారు. మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే దగ్గుపాటి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... కష్టపడే ప్రతికార్యకర్తకు టీడీపీ తగిన గుర్తింపునిస్తుందని తెలిపారు. అలాగే రూ.100 సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమాను వర్తింపజేస్తోందని చెప్పారు. మంత్రి లోకేష్ మైనార్టీల పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. అందుకే మైనార్టీలు టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. నగర మేయర్ వసీం అమూల్ బేబీలా తన అంకుల్ అనంత వెంకట్రామిరెడ్డి ఇచ్చిన స్క్రిప్టును చదువుతున్నారన్నారు. అంకుల్ 450 ఎకరాలు సంపాదిస్తే.. మేయర్ 86 ఎకరాలు మాత్రమే అంటున్నారన్నారు. త్వరలోనే మొత్తం సర్వేనెంబర్లు, ఆధారాలతో అక్రమ ఆస్తుల చిట్టా బయటపెడతామని పేర్కొన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో నగరంలోని 50 డివిజన్లతో పాటు, స్థానికంలో నాలుగు పంచాయతీల్లో తిరుగులేని మెజార్టీతో గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పొట్లూరి హరికృష్ణ, గంగారామ్, పరమేశ్వర్, చేపలహరి, ఆదినారాయణ వెంకటనారాయణ, తేజస్విని, వన్నూరప్ప, నాగరాజు, గోపాల్ గౌడ్, ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

మహిళలపై కేసులు పెట్టించిన చరిత్ర అనంతది

- వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న ఆగ్రహం

అనంతపురంక్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు మహిళలు అని కూడా చూడకుండా పోలీసులను పంపి కేసులు పెట్టించిన చరిత్ర వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిది అంటూ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న మండిపడ్డారు. నగరంలోని టీడీ పీ కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియా తో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై, ఎమ్మెల్యే దగ్గుపాటిపై విమర్శలు చేసే అర్హత అనంతకు లేదన్నారు. 16 నెలల్లోనే అభివృద్ధి అంటే ఏంటో ఎమ్మెల్యే దగ్గుపాటి చేసి చూపించారన్నారు. 2022లో అనంతపురంలో భారీగా వరదలు వచ్చి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న అనంత వెంకట్రామిరెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. ఆ కష్టకాలంలో తాము బాధితులకు అండగా నిలిచామని గుర్తు చేశారు. అనంతపురంలో గతంలో జరిగిన అరాచకాలపై మహిళలు ప్రెస్‌మీట్లు పెడితే...పోలీసులను పంపి అరెస్టు చేయించిన ఘనత ఆయనదేనంటూ మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏమీ చేయలేని అనంతకు, కేవలం 16 నెలల్లోనే ఎన్నో అభివృద్ధి పనులు చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి గురించి మాట్లాడే అర్హత లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అవాకులు చవాకులు మాట్లాడడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు కంఠాదేవి, మహేశ్వరి, కల్పన, పద్మావతి, గీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వప్న

లారీని ఢీకొని వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర సమీపంలోని కోనక్రాస్ వద్ద ఓ లారీని ద్విచక్రవాహనం వెనుక వైపు నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని హరియాన్‌చెరువు గ్రామానికి చెందిన సోమశేఖర్ (36) ధర్మవరంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యక్తిగత పనిమీద గుట్టూరుకు వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. కోనక్రాస్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సోమశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య మహాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సోమశేఖర్ (ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..

రాప్తాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని పండమేరు బ్రిడ్జిపై గల జాతీయరహదారిలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందగా.. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం రూరల్ మండలం ఎంబీ పల్లికి చెందిన అభిషేక్ (18), నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన కార్తీక్ స్నేహితులు. కాగా వారు శనివారం అర్ధరాత్రి జాతీయరహదారిపై ద్విచక్రవాహనంలో పండమేరు బ్రిడ్జిపై వెళుతుండగా అనంతపురం నుంచి బెంగుళూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అభిషేక్ మరణించినట్లు తెలిపారు. ఘటనపై కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

కారు, ఆటో ఢీ.. పలువురికి గాయాలు

అనంతపురం క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం కొడిమి వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం వైపు వెళ్తున్న ఆటోను వెనుక వస్తున్న కారు ఢీ కొంది. కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఆటోను ఢీకొంది. దీంత ఆటో పల్టీలు కొట్టింది. ప్రమాదంలో ఇద్దరు హర్యానాకు చెందిన యువకులతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారును లారీ ఢీకొని నలుగురికి..

కనగానపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన స్నేహితులు ఆరుగురు కారులో మంత్రాలయం వెళ్లారు. అక్కడ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ఆదివారం బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. కాగాతఈ మార్గమధ్యంలోని ముక్తాపురం జంక్షన్ వద్దకు రాగానే అవతలి రోడ్డుపై వెళ్తున్న సిమెంటు లారీ అకస్మాత్తుగా డివైడర్‌ను ఢీకొట్టి ఇవతలి రోడ్డులోకి దూసుకొచ్చింది. దీంతో కారు లారీని ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న అనిల్, గురు, వినయ్, సచిన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేసుకున్నారు. సిమెంటులారీ డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేశాడని స్థానికులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఆదాయం రూ.3.24 లక్షలు

అనంతపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్లో జరిగిన పశువులసంత ద్వారా రూ.3,24,950ల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతతో రూ. 1,91,650లు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,33,300 ల ఆదాయం మార్కెట్‌కు వచ్చిందని పేర్కొన్నారు.

నేడు ఉసిరి మొక్కల పంపిణీ

అనంతపురం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీనివాసనగర్ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఉసిరి మొక్కల పంపిణీ చేపట్టనున్నామని ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము ఆదివారం ప్రకటనలో తెలిపారు. శ్రీవారి సేవకుల ఆధ్వర్యంలో వాటిని ఉచితంగా పంపిణీ చేపట్టనున్నామని, 300 మొక్కలు పంపిణీ చేయనున్నామని, ప్రజలు తీసుకెళ్లాలని కోరారు.

మెమోలు జారీ

అనంతపురం అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఎస్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణానికి బిల్లులు లేకుండా 6 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేసినందుకుగాను ఓ కంపెనీ, అవంతి వేర్ హౌసింగ్ నిర్వాహకులకు మెమోలు జారీ అయ్యాయి. ఈ మేరకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ మోమోలు జారీ చేశారు. మూడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

నాణ్యమైన పప్పుశనగ సరఫరా చేయాలి



పప్పుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య

అనంతపురం అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పప్పుశనగను మాత్రమే సరఫరా చేయాలని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య సూచించారు. ఆదివారం స్థానిక గుత్తి రోడ్డులోని హిమబిందు ప్రాసెసింగ్ యూనిట్‌లో ఆయన తనిఖీలు చేశారు. పప్పుశనగ ప్రాసెసింగ్ ప్రక్రియ, నాణ్యతను పరిశీలించారు. రైతు సేవా కేంద్రాలకు నాణ్యమైన పప్పుశనగ విత్తనాలు మాత్రమే సరఫరా చేయాలని, నిబంధనలు ఎవరు అతిక్రమించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థికి ఉపాధ్యాయుల చేయూత

శింగనమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తమ పూర్వ విద్యార్థి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని తెలుసుకున్న ఉపాధ్యాయులు తమ వంతు చేయూతనందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. శింగనమల మండలకేంద్రానికి చెందిన వడ్డే మల్లికార్జున కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అతడి ఉపాధ్యాయులు కొండారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, గాయత్రి ఆదివారం ఆస్పతికి వెళ్లి పరామర్శించారు. అలాగే తమ వంతుగా రూ.25 వేలు నగదును అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. మల్లికార్జున బాల్య స్నేహితుడు కొర్రపాడుకు చెందిన భరత్ రూ.20 వేలు, 10 తరగతి బ్యాంచ్ విద్యార్థులు రూ.40 వేలు అందజేశారు.

పైప్‌లైన్‌కు అడ్డంగా చెట్టు వేర్లు

- రెండు రోజులు శ్రమించి తొలగించిన ఏఎంసీ సిబ్బంది

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోవూరు నగర్‌లో చెట్టు వేర్లు తాగునీటి పైపులైన్‌కు అడ్డం పడ్డాయి. దీంతో రెండు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా కాలేదని స్థానికులు పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్ సమస్య పరిష్కారం కోసం ఆదేశాలు ఇవ్వగా.. డీఈ సత్యనారాయణ, ఏఈ దినేష్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా సిబ్బందితో కలిసి గత 15రోజులు ఆ ప్రాంతంలో పైపులైన్‌ను పరిశీలించారు. అక్కడి రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం వెనుకవైపున పైప్‌లైన్‌కు చెట్టు వేర్లు అడ్డంగా పేరుకుపోయినట్లు గుర్తించారు. మూడు మీటర్ల మేర పెరిగిన చెట్టు వేర్లను భారీ గుంత తవ్వి రెండు రోజుల పాటు శ్రమించి తొలగించారు. సమస్య పరిష్కరించిన ఏఎంసీ అధికారులకు స్థానికులు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు.



కోవూరు నగర్‌లో పైప్‌లైన్ నుంచి బయటకు తీసిన భారీ వేర్లు

నేత్రపర్వంగా తులసీదామోదర కల్యాణం

అనంతపురం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని తపోవనం శివశక్తి సాయి ఆలయంలో ఆదివారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో తులసీదామోదర కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు దేవరకొండ బాలాజీశర్మ తులసి, దామోదర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే విశ్వక్సేన ఆరాధన చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆలయ ధర్మకర్త శ్రీరాములు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో తులసీ దామోదరస్వాముల ఉత్సవమూర్తులు

టమోటా కిలో రూ.24

అనంతపురంరూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9తో, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1350 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

భారత జట్టు గెలవాలని పూజలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు వన్‌డే వరల్డ్ కప్ గెలవాలని కోరుతూ మండలకేంద్రంలోని శివాలయంలో టీడీపీ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముంబయ్‌లో భారత్, దక్షిణాఫ్రికా మహిళా జట్ల మధ్య జరుగుతున్న ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయదుందుబి మోగించి వరల్డ్ కప్‌ను కైవసం చేసుకోవాలని శివున్ని కోరుకున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు అంకే అమరేంద్ర, మాడెం సూర్యనారాయణరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రామాంజి, చెన్నకేశవులుగౌడ్, అమరేంద్రరెడ్డి, ఓబిరెడ్డి, ఉత్తరకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలో గల తిరుమల దేవస్థానంలో వెంకటేశ్వరుడికి టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేయించారు. సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, కన్వీనర్‌సుధాకర్, సింగిల్‌విండో అధ్యక్షుడు ముత్యాలు, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు లింగాశ్రీధర్‌నాయుడు, మారుతీప్రసాద్, చిత్రరంజన్, శేషు, రఘురాములు, ముత్యాలు పాల్గొన్నారు.

●కనగానపల్లి: మండలంలోని పాతపాళ్యంలో టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు పూజారి రాజాక్రిష్ణ, బిల్లే దాము మాదవరాజుల స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం బయట 101 కొట్టారు. టీడీపీ, జనసేన నాయకులు నాగేంద్ర, మాదన్న, రాధాక్రిష్ణ, నాగేంద్ర, గోపాల్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

అనంతపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో రుద్రంపేటలోగల వాల్మీకి కమ్యూనిటీ హాల్లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహించడంతో పాటు చిన్నారులు సంప్రదాయ నృత్యప్రదర్శనలు చేశారు. అనంతరం 2023 ఏప్రిల్ నుంచి 2025 అక్టోబరు వరకు ఉద్యోగ విరమణ పొందిన వాల్మీకి ఉద్యోగులను, ఇటీవల వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందినవారిని, అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌లో రాణిస్తున్న తేజస్వినిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్, నారాయణస్వామి, కోశాధికారి కృష్ణమూర్తి, విశ్రాంత ఎస్పీ నరహరి, నాయకులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

కోదండరామ స్వామికి పూజలు



గుంతకల్లుటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీస్ట్రీట్‌లో వెలసిన కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం వెండి కవచములకు పూజలు నిర్వహించారు. గర్భాలయంలో మూలవరులు శ్రీరామచంద్రమూర్తి, సీతమ్మ, లక్ష్మణులకు 8కేజీల వెండితో కవచములు తయారు చేయించారు. కమచములకు సంప్రోక్షణ చేతి పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి ధరింపజేశారు. ఆలయ ఈఓ మల్లికార్జున, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. అశ్వత్థనారాయణుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితుడు

విడపనకల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల వద్ద ఉన్న నాగుల కట్టపై అశ్వత్థనారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం గ్రామ పెద్దలు, మహిళలు అధ్వర్యంలో మేళ తాళాలతో స్థానిక గౌరమ్మ బావికి వెళ్లి గంగను తెచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణిన్ని వేదపండితుల అధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఘనంగా వన భోజనాలు



ఉసిరి, తులసి చెట్లకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పామిడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాడి వెంకటస్వామి తోటలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. వంద ఏళ్లపైబడిన ఉసిరి వృక్షానికి, తులసి మాతకు అర్చకుడి మంత్రోచ్ఛారణల నడుమ సంకల్ప పూజలు చేపట్టారు. చెట్టు కింద శివ అభిషేకం, దీపారాధనలు చేశారు. అనంతరం క్రీడా పోటీలలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కొత్తూరు రామమోహన్, అనూరాధ కుటుంబ సభ్యులు ఆర్యవైశ్యులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటైన ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులను ఆర్య వైశ్య పాలక మండలి సభ్యులు సత్కరించారు.

రేపు ఆంజనేయస్వామి రథోత్సవం

రాయదుర్గంరూరల్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయాల కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి, గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. స్వామివారికి మంగళవారం ఉదయం 7 గంటలకు గంగపూజ, 8 గంటలకు అభిషేకం, మహామంగళహారతి, 10 గంటలకు రథానికి కలశస్థాపన, 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 4 గంటలకు రథానికి బలిదానం సమర్పణ, 4.30 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్మశాన దారి శుభ్రం చేసిన టీడీపీ నాయకులు



శ్రీధరఘట్టలో శ్మశాన దారిని శుభ్రం చేయిస్తున్న నాయకులు

బొమ్మనహాళ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో రైతు సేవా కేంద్రం నుంచి శ్మశాన వాటిక వరకు వెళ్లే దారి చెత్తకుప్పలతో నిండిపోయింది. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి ఆధ్వర్యంలో తిప్పేస్వామి, ఏరిస్వామి ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సాయంతో చెత్తతో కప్పుకుపోయిన దారిని శుభ్రం చేసి దారిని సుందరంగా మార్చారు. కార్యక్రమంలో లింగప్ప తదితరలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఏర్పాటు

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. వజ్రకరూరులో ఆదివారం మురళి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాస్ గుప్త, అధ్యక్షుడిగా రాంబాబు, ఉపాధ్యక్షులుగా శ్రీదేవి, సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్న కుమార్, కోశాధికారిగా వేణుగోపాల్, కార్యదర్శులుగా రామచంద్ర నాయక్, రామచంద్ర, మోహన్, షాలెం, మధుబాబు, అంజినేయులు, ధనుంజయ వర్మ, భాగ్యరేఖ, శివ, మహబూబ్ బాషా, జిల్లా కౌన్సిలర్‌గా అశోక్ కుమార్, నరసింహులు, శైలజ, జానకి, రాములు, మైలార్ లింగ, శ్రీధర్, వెంకటేశులు, మోహన్ బాబు ఎన్నికయ్యారు.

కార్యకర్తలకు టీడీపీ అండ: విప్ కాలవ



బాధిత కుటుంబీకులకు బీమా పత్రాన్ని అందజేస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు టీడీపీ సభ్యుల కుటుంబాలకు ప్రమాద బీమా కింద మంజూరైన రూ.ఐదు లక్షలు నేరుగా ఆ కుటుంబ సభ్యుల అకౌంట్‌లో పార్టీ జమ చేయించిందన్నారు. రాయదుర్గంలోని తన స్వగృహంలో ఆయన ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు బీమా మంజూరు ఉత్తరాలను అందజేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.వంద ప్రమాద బీమా ప్రీమియంను పార్టీనే చెల్లిస్తుందన్నారు. డీ.హీరేహాళ్ మండలం కూడ్లూరు గ్రామానికి చెందిన లక్ష్మణ్ణ ఓ ప్రమాదంలో మరణించారన్నారు. ఆయన కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందన్నారు. అదే మండలానికి చెందిన నవీన్‌కుమార్ అనే మరో సభ్యుడి మరణంతో ఆ కుటుంబం కూడా ఆర్థిక సమస్యలతో సతమతమవుతోందన్నారు. లక్ష్మణ్ణ భార్య లక్ష్మీనారాయణమ్మకు రూ.5 లక్షలు, నవీన్‌కుమార్ తరపున లావణ్యకు రూ.5 లక్షలు బీమా మంజూరు అయిందన్నారు. ఇరువురి మరణం పార్టీకి తీరని లోటని అన్నారు.

క్రికెట్ మ్యాచ్ వీక్షణ: ప్రపంచ మహిళా క్రికెట్ చరిత్రలో భారత్ మహిళలు చక్కటి ప్రతిభతో రికార్డు సృష్టిస్తున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఇండియా వర్సెస్ సౌత్ ఆఫ్రికా మహిళా క్రికెట్ ఫైనల్ పోటీలను ఆదివారం ఆయన వీక్షించారు. బాలికల కళాశాల విద్యార్థులతో కలిసి ఆయన ఆడిటోరియంలో కుటుంబసమేతంగా వీక్షించారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన పెద్ద స్క్రీన్‌లపై ఫైనల్ పోటీలను వీక్షిస్తూ మాట్లాడారు.



కుటుంబంతో కలిసి క్రికెట్‌ను వీక్షిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

నేడు సచివాలయం ప్రారంభం

రాయదుర్గంరూరల్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్‌హళ్లి గ్రామంలో సచివాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

రాయదుర్గంరూరల్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు సేవాభావాన్ని అలవర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సూచించారు. ఆదివారం మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మద్దానేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేదారిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అధ్యాపకులు వీరేష్, హెచ్ఎం హేమలత, గ్రామపెద్దలు, అధ్యాపకు బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాడిపత్రి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వామి వివేకానంద పాఠశాలలో ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తరపున పుట్లూరు మండలం గోపురాజుపల్లి గ్రామానికి చెందిన రంగారెడ్డికి వైద్య చికిత్సల నిమిత్తం ఆదివారం రూ.20వేలు అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. సభ్యులు రామేశ్వరరెడ్డి, శ్రీహరి, శంకర్, రంగ య్య, కుమారస్వామి, హరినారాయణ పాల్గొన్నారు.

రైతులకు కరెంటు కష్టాలు

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేరన్నపల్లి, యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి తదితర గ్రామాలకు చెందిన ఫీడర్ కింద మూడురోజులుగా విద్యుత్ అంతరాయం ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మూడురోజులుగా కేవలం రెండు మూడు గంటలు మాత్రమే విద్యుత్ అందిస్తున్నారని రైతులు మండిపడ్డారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని తేరన్నపల్లి గ్రామానికి చెందిన రైతులు నరేంద్రనాయుడు, ప్రసాద్‌నాయుడు వాపోయారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): స్థానిక హంపి రెడ్డి భవనంలో ఆదివారం డీవైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అందరికి విద్య, ఉపాధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా పోరాడుతున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కసాపురం రమేష్, సురేంద్రబాబు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో డబ్బాతో తూకాలు



డబ్బాతో బియ్యం వేస్తున్న దృశ్యం

యాడికి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో డబ్బాతో తూకాలు వేయడం చట్టరీత్యా నేరమని తూనికలు, కొలతలశాఖ గుంతకల్లు అధికారి వైజీ శంకర్ తెలిపారు. ఆదివారం యాడికిలోని రేషన్ దుకాణం-32లో తూనికలు, కొలతలుశాఖ అధికారి తనిఖీచేశారు. రేషన్ బియ్యం డబ్బాతో తూకం వేయడాన్ని పరిశీలించారు. సంబంధిత రేషన్ డీలర్ కు రూ.5వేలు జరిమానా విధించారు. ఆయన మా ట్లాడుతూ ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రిజర్వాయర్‌కు 2,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2780 క్యూసెక్కులు ఉన్నట్లు ఆదివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో 2780 క్యూసెక్కులు ఉండగా ప్రస్తుతం 1.708 టీఎంసీల నీటి నిల్వ వుందన్నారు. ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1608 క్యూసెక్కులు వెళుతున్నట్లు వారు తెలిపారు.

యువకుడిపై దాడి

శెట్టూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాత్రి రవితేజ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడు దాడిచేసి గాయపరిచిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రాంభూపాల్ తెలిపిన మేరకు రవితేజ కుటుంబానికి సురేష్ భూమి అమ్మకం విషయంలో గొడవపడి కొడవలితో దాడి చేసి గాయపరచినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. రవితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

మట్కాబీటర్ల అరెస్ట్

తాడిపత్రి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం పక్కన ఉన్న శ్మశానం రోడ్డులో ఆదివారం ముగ్గురు మట్కాబీటర్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.60100 స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు. మట్కారాస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి బంకమడివీధికి చెందిన మహమ్మద్‌రజాక్, విజయనగర్‌కాలనీకి చెందిన వెంకటరమణ, నందలపాడుకు చెందిన రాములను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

జూదరులు..

యాడికి(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేకాట ఆడుతున్న 10మందిని శనివారం రాత్రి అరెస్ట్‌చేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడిలో పేకాట ఆడుతున్న 10మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.8880, మూడు ద్విచక్రవాహనాలు, 8 సెల్‌ఫోన్లు సీజ్‌చేసినట్లు తెలిపారు.

కేబుల్ చోరీపై ఫిర్యాదు

యాడికి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలో వరుసగా జరుగుతున్న వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్ చోరీలపై పలువురు రైతులు ఆదివారం తాడిపత్రి డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరికి ఫిర్యాదు చేశారు. రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్‌ను దొంగలు చోరీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. వరుసగా జరుగుతున్న చోరీలతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. దొంగలపై చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

ఇరువర్గాల ఘర్షణ

తాడిపత్రి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కోటిసంతకాల సేకరణలో భాగంగా ఆదివారం పట్టణంలోని పోరాటకాలనీలో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఇరువురు వర్గాలు తటస్తపడడంతో మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతోపాటు రాళ్లు కూడా రువ్వుకున్నారు. కొందరి వాహనాల అద్దాలు కూడా పగిలాయి. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు. అనంతరం ఇరువర్గాల మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాసాల వద్ద కార్యకర్తలు చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టి పంపించారు. ఇరువర్గాల నాయకుల ఇళ్లవద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి బందోబస్తును ఏర్పాటుచేశారు.

చిత్ర ప్రదర్శనలో శ్రీధరన్ ప్రతిభ



మండలి బుద్ధప్రసాద్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న చిత్రకారుడు శ్రీధరన్

గుంతకల్లుటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): చిత్ర ప్రదర్శనలో చిత్రకారుడు శ్రీధరన్ ప్రతిభ కనబరిచారు. విజయవాడలో బాలోత్సవ భవనంలో ఆదివారం ఆర్ట్ అసోసియేషన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో మన సంస్కృతి మీద చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో 70 మంది కళాకారులు పాల్గొన్నారు. ఇందులో శ్రీధరన్ శ్రీ వాగ్గేయకారులు, పురంధరదాసులు, అన్నమయ్యపాట అలపిస్తుండగా వేంకటేశ్వరస్వామి వింటున్న చిత్రాన్ని, రథసప్తమి సందర్భంగా సూర్యభగవానుడి చిత్రాన్ని ప్రదర్శరించగా ఉత్తమ చిత్రాలుగా ఎంపికయ్యాయి. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ శరత్‌చంద్ర, ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ చైర్మన్ తేజస్వి పొడపాటి చేతుల మీదుగా శ్రీధరన్‌కు శాలువ వేసి, జ్ఞాపికను అందజేశారు.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుట్లూరు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మంచౌదరిని టీడీపీ నాయకులు ఆదివారం అనంతపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్ సుదర్శన్‌నాయుడు చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు లక్ష్మయ్య, ఆదినారాయణరెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, పెద్దిరాజు, వెంకటనాయుడు పాల్గొన్నారు.